గాయత్రి మందిర్ రోడ్డును తక్షణమే వేయాలి

హెచ్‌పీరోడ్డులో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, నవంబర్ 16: ఫతేనగర్ డివిజన్ హెచ్‌పీరోడ్డులోని గాయత్రి మందిర్ రోడ్డును తక్షణమే వేయాలని స్థానిక కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. శనివారం ఆయన హెచ్‌పీరోడ్డులో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాయత్రి మందిర్ రోడ్డులో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేసినందున సరిపడా నిధులు కేటాయింప జేసుకొని తక్షణమే రోడ్డు వేయాలని సూచించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశంతో రోడ్డు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ శంకర్, ఏఈ రాధాకృష్ణ, తూము జగదీశ్, శ్రీనుపటేల్, మల్లికార్జున్, ప్రీతం, బాబురావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

ప్రజలు సమస్యలు తెలుసుకుంటున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్, నవంబర్ 16: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సంక్షేమసంఘాల సభ్యులు, మహిళలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు శనివారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట, నవంబర్16: ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. భరత్‌నగర్‌లోని శ్రీసాయి అయ్యప్ప స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన మండల పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూము శ్రావణ్‌కుమార్ హాజరై స్వాములకు అన్నదానం చేశారు. ఈనెల 29 వరకు ప్రతి రోజు ఆలయంలో గణపతి హోమం, అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పడిపూజ, భజన, అల్పాహారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వాములు నరేందర్, సత్తయ్య, రామకృష్ణ, రాధాకృష్ణ, సప్పిడి వెంకటేశ్, బాలు, సప్పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గచ్చిబౌలి స్టేడియంలో 5కే రన్‌ను జెండాఊపి ప్రారంభిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శారీరక శ్రమ అవసరం: ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి, నవంబర్ 16: నేటి ఉరుకుల, పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో ప్రణవ్‌తేజ్, అక్రాంత్ దేవరకొండ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5కే, 2కే రన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఉపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాంత్రిక జీవనానికి అలవాడు పడిపోతున్న ప్రస్తుత తరుణంలో నిత్యం వ్యాయామం మనందరికీ ఎంతో అవసరం అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. నిత్యం వ్యాయామం, యోగా నిత్యం మన దినచర్యలో భాగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్, జనార్దన్ రెడ్డి, కరుణాకర్ గౌడ్‌తో పాటు రన్‌లో పలువురు విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

సీఎస్ఆర్ కింద చెరువులకు మహర్దశ

మియాపూర్/మాదాపూర్, నవంబర్ 16: భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు అంతస్తులు కాదని కాలుష్యం లేని వాతావరణం స్వచ్ఛమైన సహజ వనరులనని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వం నుంచి రూపాయి సాయం లేకుండా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చెరువులకు పునరుజ్జీవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు, తొలి అడుగు పడిందన్నారు. నెక్సెస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్ గురునాథం చెరువు సుందరీకరణ పనులకు లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఆనంద్ మల్లిగవాడ్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నెక్సెస్ మాల్ ప్రతినిధులతో అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అతి పెద్దదైన శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువుల సుందరీకరణకు నెక్సెస్ మాల్ ఆర్థిక తోడ్పాటు, మల్లిగ్ వాడ్ ఫౌండేషన్ ఆచరణకు ముందుకు రావటం అత్యంత సంతోషదాయకమన్నారు. ఒకనాటి మంచినీటి చెరువు మురుగు నీటి కాలుష్యంతో దారుణంగా తయారై దోమలకు ఆవాసంగా మారటం అత్యంత బాధాకరమని, దీనివల్ల పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ చెరువును కాంక్రీట్ వినియోగానికి భిన్నంగా సహజసిద్ధంగా సుందరీకరించేందుకు ముందుకు వచ్చిన సంస్థకు తమ సంపూర్ణ తోడ్పాటు ఉంటుందని.. వారి సహకారంలో నియోజకవర్గంలో 30కి పైగా చెరువులను సుందరీకరించాలని కోరారు. సుందరీకరణ అనంతరం చెరువు పరిసరాల పరిరక్షణకు పరిసర ప్రజలు నడుం బిగించాలని పీఏసీ చైర్మన్ గాంధీ కోరారు. చెరువులో తామర పువ్వులు పెంచి , చెరువు పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్ది దోమలను పూర్తి స్థాయిలో తరిమి పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఆనంద్ మల్లిగవాడ్ మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణను కాంక్రీట్ వినియోగించకుండా అత్యంత సహజసిద్ధంగా చేపడుతామని, క్రిస్టల్ క్లియర్ నీటి అనుభూతి పొందేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నెక్సెస్ మాల్ సీఈవో జయేన్ నాయక్ , రామ్ బొట్ట, చైతన్య, అధికారులు నళిని, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి శివాలయంలో అయ్యప్పలకు అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 16: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో అల్లాపూర్ డివిజన్‌కు చెందిన టి.సుదర్శన్‌బాబుకి రూ.3.50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఆదుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

అన్నసమారాధన అభినందనీయం

అయ్యప్పలకు అన్నసమారాధన అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి.. అయ్యప్పలకు అన్నసమారాధనను ఎమ్మెల్యే కృష్ణారావు ప్రారంభించి మాట్లాడారు. కార్తిక మాసంలో మాలధారణ చేసిన అయ్యప్పలకు మధ్యాహ్నం బిక్షను అందించడానికి.. నియమనిష్టలతో బిక్షను తయారు చేసి అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చిన్నతులసీ, స్థానిక నేతలు ఉన్నారు.

బీఆర్ఎస్ నేతను పరామర్శించిన ఎమ్మెల్యే

బాలానగర్, నవంబర్ 16: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్‌నేత మహంకాళి సూరిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరామర్శించారు. బాలానగర్ డివిజన్ పరిధి రాజుకాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి సూరిని పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దారం సతీశ్‌గుప్తా, ఎలిజాల యాదగిరి, నర్రా దేవేందర్ రెడ్డి, రంగంపేట శ్రీనివాస్ ముదిరాజ్, ప్రేంకుమార్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాలానగర్, నవంబర్ 16 : 33/11 కేవీ విద్యుత్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) ఏడీఈ పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం 16న ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు గిరినగర్, ఫీడర్ పరిధిలోని డొమెస్టిక్ గిరినగర్, టీడీపీ ఆఫీస్, శ్రీనివాసా టవర్స్, హనుమాన్ టెంపుల్, ప్రదాయ కంపెనీ, ఏపీహెచ్‌బీకాలనీ, విజయకృష్ణ ఆర్కేడ్, గురుమూర్తినగర్, సౌజన్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం. అదేవిధంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అస్‌బెస్టాస్ హిల్స్, ఈశ్వర్ విమల్, ఎల్‌అండ్‌టీ, నాగార్జున సిగ్నేడ్, రాజ్‌పుడ్స్, ఆర్ఆర్‌నగర్, రసూల్ పార్మా, ప్రగతి ప్యాక్, అరుణాచలం, టీసీ బాలానగర్, గ్లోబల్ హోమ్స్ ఫీడర్ల పరిధిలోని ఏబీకాలనీ, గాంధీనగర్, శివాజీ విగ్రహం, ఆల్పా కాంప్లెక్స్, ఈశ్వర్ విమల్, గిరినగర్, ఆర్ఆర్‌నగర్ నాగార్జున సిగ్నేడ్, నెక్సాన్ ఎలక్ట్రికల్స్, రాజ్ పుడ్స్, టెక్నో ఎలక్ట్రికల్స్, బజాజ్ ఎలక్ట్రికల్స్, రసూల్ ప్రాగా, ఆర్ఆర్‌నగర్, శ్రీసాయి రెసిడెన్సీ, బాలానగర్, ఐడీపీఎల్, పూజ ఇండస్ట్రీస్, ఆగ్రో ఇండియా ఇంజినీరింగ్, గ్లోబల్ హోమ్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగనుంది. వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన సూచించారు.

డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని తెలిపారు. రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ టెక్నీషియన్స్, రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30 ఆఖరు అని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ప్రిన్సిపాల్స్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలకు ప్రిన్సిపాల్స్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ పదవుల్లో కొత్త వారిని నియమించిన నేపథ్యంలో వారు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కాసిం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి.ప్రభాకర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఐ.శేఖర్, లా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంప్రసాద్ బాధ్యతలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు, బట్టలు పంపిణీ

దుండిగల్, నవంబర్ 16: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌లోని శ్రీవాసవి సేవక్ ప్రతినిధులు శనివారం నిజాంపేట్ క్రాస్‌రోడ్డు, సర్దార్‌పటేల్‌నగర్‌లోని గ్రేస్ ఓల్డేజ్ హోంలోని వృద్ధులకు దుప్పట్లు, బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీసేవక్ అధ్యక్షులు అల్లాడి మహేశ్, అనిల్‌కుమార్, సంతోష్‌కుమార్, అమరేశ్, ప్రదీప్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు కార్పొరేటర్ పరామర్శ

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట చౌరస్తాలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు బీఆర్ఎస్ కార్యకర్త అప్సర్‌పై వేడినూనె పడి తీవ్రగాయాలయ్యాయి. శనివారం డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న అప్సర్‌ను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఎజాజ్ పాల్గొన్నారు. *– బాలానగర్, నవంబర్ 16*

సీసీరోడ్లు వేయాలంటూ జోనల్ కమిషనర్‌కు వినతి

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నూతనంగా సీసీ రోడ్లు వేయాలంటూ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం.

– అల్లాపూర్, నవంబర్ 16

వైభవంగా కార్తికమాస మహోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లోని శ్రీసిద్ధివినాయక భ్రమరాంబిక మల్లికార్జున దేవాలయంలో కార్తికమాసం పూజలో.. సంపూర్ణనందగిరి స్వామి, భక్తులు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 16: కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లోని శ్రీసిద్ధివినాయక భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాస్థానంలో నిర్వహించిన కార్తికమాస మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో శ్రీ సంపూర్ణనందగిరి స్వామి చేతుల మీదుగా నిర్వహించిన జ్వాలాతోరణం పూజలు వైభవంగా సాగాయి. పూజలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని.. కాలనీ పురవీధులు శివనామస్మరణతో మార్మోగాయి. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కొదండ రామయ్య, కళ్యాణ్‌వర్మ, శ్యామ్ సుందర్, వెంకటరమణ, అనిల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు పూజలు..

కేపీహెచ్‌బీ కాలనీ 4, 6వ ఫేజ్‌లోని శ్రీ సిద్ధి వినాయక భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాస్థానం, రామలింగేశ్వర ఆలయంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తికమాసంలో శివున్ని అరాధించడం వల్ల ప్రజలందరికి మంచి జరగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్ శివాలయంలో ప్రత్యేక పూజలో కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు దంపతులు

ఫాక్స్‌సాగర్ చెరువు–రాంరెడ్డినగర్ లింక్‌రోడ్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

లింక్‌రోడ్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవంబర్ 16: లింక్‌రోడ్ల అభివృద్ధితో ప్రధాన రోడ్లపై ఏర్పడే ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా అధికార యంత్రాంగం లింక్‌రోడ్లను త్వరితగతిన గుర్తించి అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సూచించారు. హెచ్ఆర్‌డీసీఎల్ (హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ లింక్ రోడ్ల నిర్మాణంలో భాగంగా రూ.29కోట్ల వ్యయంతో చేపడుతున్న జీడిమెట్ల–సుభాష్‌నగర్ డివిజన్ సరిహద్దుల్లో ఫాక్స్‌సాగర్ నుంచి రాంరెడ్డినగర్, ఇండస్ట్రియల్ ఏరియా లింక్‌రోడ్డును శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఆయా శాఖల అధికారులు సందర్శించి పరిశీలించారు. లింక్‌రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని.. ఆ దిశగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

కమనీయం.. నృత్య విన్యాసం

కొండాపూర్, నవంబర్ 16: వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారుల కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో కథక్ నాట్య గురువులు సంజుక్త ఘోష్ శిష్య బృందం బెంగాలీ సంస్కృతి సంప్రదాయాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ పాటలకే నృత్య ప్రదర్శనలిచ్చారు. అనంతరం కూచిపూడి నాట్య గురువులు ఒగ్గు ప్రవీణ్ శిష్య బృందం తాండవనృత్యకారి, జతిస్వరం, రామాయణ శబ్దం, మరకత, మండూక శబ్దం, దశావతార శబ్దం, హిందువుల తిల్లాన అంశాలను నర్తించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకుంది.

మాదక ద్రవ్యాలపై అవగాహన

వివేకానందనగర్ డివిజన్ ప్రగతి డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో నెలకొనే దుష్పరిణామాలపై యాంటీ డ్రగ్స్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో పోలీసులు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగంతో యువత నిర్వీర్యం అవుతున్నదని, ఉత్తమ భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారన్నారు. యువత విద్యార్థులే లక్ష్యంగా కొందరు అక్రమంగా వాటిని విక్రయిస్తున్నారని, యువత వాటి బారిన పడవద్దని సీఐ శ్రీనివాస్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, రవీందర్, ఎన్‌సీసీ అధికారి రత్నాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

– మియాపూర్, నవంబర్ 16

ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని కాంటినెంటల్ హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన కిడ్స్ హెల్త్ కార్నివాల్‌లో ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఎండీ డాక్టర్ గురు ఎన్ రెడ్డి. *– శేరిలింగంపల్లి, నవంబర్ 16*

హెచ్ఎంటీ ప్రీమియర్ లీగ్ సీజన్-2 చాంపియన్

● విజేతలకు బహుమతులను అందజేసిన జీడిమెట్ల సీఐ మల్లేశం

విజేతలకు బహుమతులను అందజేస్తున్న జీడిమెట్ల సీఐ మల్లేశం తదితరులు

కుత్బుల్లాపూర్, నవంబర్ 18: చింతల్ హెచ్ఎంటీ మైదానంలో జరిగిన హెచ్ఎంటీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఈనెల 14,15తేదీల్లో రెండు రోజుల పాటు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలో ఆరు టీమ్‌లు ప్రకాశ్11, క్రేజీఫ్రెండ్స్, సంతు బ్లాస్టర్స్, హెచ్ఎంటీ రైజర్స్, పటేల్ 11, మజిసా క్రికెట్ క్లబ్ జట్లు పోటీలో భాగస్వాములయ్యాయి. మజిసా క్రికెట్ క్లబ్, ప్రకాశ్ 11 జట్లు ఫైనల్‌కు చేరాయి. ఈ రెండు జట్ల మధ్య జరిగిన చివరి మ్యాచ్ పోటాపోటీగా జరిగిన ఆటలో మజీసా క్రికెట్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. టోర్నమెంట్ నిర్వాహకులు నాగరాజు, ఫయాజ్ నేతృత్వంలో జరిగిన విజేతలకు బహుమతుల అందజేతలో జీడిమెట్ల సీఐ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రేమ్, ఆయా జట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.